బోనాలకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


జోనల్ కమిషనర్‌తో సమావేశమైన గాజుల అంజయ్య, రాకేష్ తివారి, మధుసూదన్‌యాదవ్

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల ప్రారంభానికి ముందే పాతబస్తీలోని అన్ని ఆలయాల వద్ద అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నతో పాటు ఇంజినీరింగ్ అధికారులను కోరినట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో తాను పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయని సంబంధిత కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్ రాకేశ్ తివారి, మాజీ ఉపాధ్యక్షులు మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ ముగియడంతో దరఖాస్తుల పరిశీలన మొదలైందన్నారు. ఒక దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే సంబంధిత తనిఖీలు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు అందేలా కృషి చేయాలని తాను అధికారులను కోరానన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ, లంగర్‌హౌజ్ మజ్లీస్ అధ్యక్షులు హారూన్ ఫరాన్, వజీఉజ్‌జమా సిద్ధిఖీ తదితరులున్నారు.

జూనియర్ డాక్టర్ల ఆందోళన


నల్ల రిబ్బన్‌లతో నిరసన వ్యక్తం చేస్తున్న జూడాలు

సుల్తాన్‌బజార్: తమ సమస్యల పరిష్కారం కోసం జూడాలు ఆందోళన చేపట్టారు. శనివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు జూనియర్ డాక్టర్లు నల్ల రిబ్బన్‌లను కట్టుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 24వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న జుడాల సమ్మెకు సంఘీభావంగా ఈ నిరసన చేస్తున్నట్లు వారు తెలిపారు. గత ఆరు నెలలుగా స్టైఫండ్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా ఉస్మానియా హాస్పిటల్ నూతన భవనం నిర్మించాలని ఆరేళ్లుగా కోరుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనానికి శంకుస్థాపన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా హాస్పిటల్‌లో స్థలం లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డాక్టర్లకు కూడా ఎలాంటి సౌకర్యాలు ఉండటం లేదన్నారు. వైద్య విద్యార్థులకు సీట్లు పెంచుతున్నారు. కానీ హాస్టల్స్ పెంచడం లేదని వాపోయారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్-కేవీ యూనియన్‌లో చేరిన ఎంటమాలజీ కార్మికులు


బాలకృష్ణ సమక్షంలో యూనియన్‌లో చేరిన కార్మికులు

యాకుత్‌పురా: జీహెచ్ఎంఈయూ యూనియన్‌కు చెందిన ఎంటమాలజీ కార్మికులు తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ బీఆర్ఎస్-కేవీలో చేరారు. జీహెచ్ఎంఈయూ గ్రేటర్ ఎంటమాలజీ విభాగం అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో దాదాపు 250 మంది కార్మికులు బీఆర్ఎస్-కేవీ అధ్యక్షుడు కొమ్మగళ్ల బాలకృష్ణ సమక్షంలో యూనియన్‌లో చేరినట్లు మల్లేష్ తెలిపారు. కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న బాలకృష్ణ నాయకత్వంపై నమ్మకంతో యూనియన్‌లో చేరడం జరిగిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన



గోల్కొండ: ప్రభుత్వ మైనార్టీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అత్యుత్తమ విద్యాబోధన జరుగుతుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శనివారం మెహిదీపట్నంకు చెందిన పలువురు వ్యక్తులకు ఆయన పిల్లలకు చదువు ఆవశ్యకతపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆసిఫ్‌నగర్‌లో ప్రభుత్వ మైనార్టీ స్కూల్‌తో పాటు జూనియర్ కళాశాల కూడా ఉందని అదే విధంగా బాలికల మైనార్టీ గురుకుల పాఠశాల గోల్కొండలో, బాలుర కోసం వృత్తి విద్యా నేర్పించేందుకు ఇబ్రహీంబాగ్‌లోని వన్‌మోర్‌నగర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలతో పాటు ఒకేషనల్ జూనియర్ కళాశాల కూడా ఉందని ఆయన అన్నారు. ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ కోసం తనను సంప్రదిస్తే అండగా ఉంటానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని భారతమాత ఆలయం సమీపంలో నూతన సీసీ రోడ్డు పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు సాయిబాబా, కాపర్తి శ్రీకాంత్, బి.వై.శ్రీకాంత్, బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, పి.రాజేశ్వర్, అల్లి మధుసూదన్ గిరి, జమాల్‌పూర్ అశోక్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తాం


డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తామని జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఎస్.విద్యాధర్ పేర్కొన్నారు. అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సమావేశమై బోనాల నిర్వహణపై విద్యాధర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. త్వరలోనే అన్ని ఆలయాల వద్ద పనులు ప్రారంభిస్తామన్నారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వీధి దీపాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, కృష్ణ, ధర్మేందర్, వెంకటేష్, దేవేందర్, నాగేశ్వర రావు, కుమార్, కిశోర్ పాల్గొన్నారు.

మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మొక్కను అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, టీపీసీసీ ఓబీసీ సెల్ అధికార ప్రతినిధి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి మేరు కులస్తుల సమస్యలు వివరించారు. 20 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తులు కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. మేరు కులస్తులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించి చైర్మన్ పదవులను ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా కసిరెడ్డి నారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మేరు కులస్తుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోరికలు తీర్చే బంగారు మైసమ్మ

- 27వ తేదీ నుంచి బంగారు మైసమ్మ ఆలయ పునర్ నిర్మాణం, 25వ వార్షికోత్సవ వేడుకలు
- సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా 25 రోజుల పాటు అన్న ప్రసాద వితరణ
- నిజాం కాలం నుంచి ఏటా బోనాలు సమర్పిస్తున్న భక్తులు


హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయం

చార్మినార్: శాలిబండ హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయం పునర్ నిర్మాణం 25వ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీ నుంచి సిల్వర్ జూబ్లీ బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 27న పవిత్రోత్సవం, మహాభిషేకం, చండీహోమం, సహస్ర నామ కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభించనున్నామని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో వెలసిన అమ్మవారు పాతబస్తీ భక్తుల పాలిట కొంగు బంగారంగా పిలవబడుతోంది. ఈసారి 25వ పునర్ నిర్మాణ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవాలను పురస్కరించుకుని 25 రోజుల పాటు నిరంతరాయంగా అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

దేవిడిలో వెలసిన బంగారు మైసమ్మ ఆలయం..

నిజాం పరిపాలనలో ప్రధాన మంత్రిగా పని చేసిన కిషన్ పర్షాద్ దేవిడి శాలిబండలో ఉంది. ఈ దేవిడిలోనే బంగారు మైసమ్మ ఆలయం వెలసింది. కోట రక్షణ గోడకు ఎడమ వైపున అమ్మవారి ఆలయం ఉంటే అన్ని విధాల కలిసొస్తోందనే నమ్మకంతో నిజాం కాలంలో ఇక్కడ అమ్మవారి ఆలయం ఏర్పాటైందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మూసీలో వరదలు వచ్చినప్పుడు నిజాం ప్రభువు తరపున ప్రధాన మంత్రి కిషన్ పర్షాద్ పసుపు, కుంకుమలను చాటలో ఉంచి లాల్ దర్వాజ సింహవాహిణి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మూసిలో వదిలారని.. ఆ చాటను ఇక్కడి నుంచే తయారు చేసి తీసుకెళ్లారన్నారు. ఆ చోటనే బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మించి నిత్యం పూజలు చేయడం జరుగుతుందంటున్నారు.


అమ్మవారు

వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు..



బంగారు మైసమ్మ ఆలయంలో ఈసారి బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నాం. ఆలయ పునర్ నిర్మాణం అనంతరం ఈసారి 25వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నాం. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశాం. – మధుసూదన్ యాదవ్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి

25 రోజుల పాటు అన్నదానం...



ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈసారి 25 రోజుల పాటు భక్తులకు అన్నదానం చేయనున్నాం. ఈనెల 27 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. – రాజేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

తెలంగాణలో బీజేపీ బలోపేతం


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రాజువప్రసాద్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలంగా ఉందని ఇటీవలే జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు ఎస్.రాజువప్రసాద్ శనివారం కేంద్ర మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కేంద్ర మంత్రిగా మరోసారి నియమితులైన సందర్భంగా అభినందించారు.

'బోనాలను వైభవంగా నిర్వహిస్తాం'


మధుసూదన్ గౌడ్

చార్మినార్: బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యామని ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు జె.మధుసూదన్ గౌడ్ తెలిపారు. ఈసారి జరిగే బోనాల జాతర ఉత్సవాలను గతంలో కన్నా మరింత వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీకి కొత్తగా కమిటీ ఏర్పడిందన్నారు. తనతో పాటు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కె.నరేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా చంద్ర మోహన్‌గౌడ్, ఎం. సత్యనారాయణ ముదిరాజ్, కోశాధికారులుగా కిరణ్‌గౌడ్, ఆనంద్ ముదిరాజ్, సంయుక్త కార్యదర్శులుగా సతీష్‌గౌడ్, ఆర్. శ్రీనివాస్, భవానీ శంకర్, బాబు ముదిరాజ్ పోతరాజు, ఎం.ప్రదీప్ గౌడ్ తదితరులు నియమితులయ్యారని ఆయన తెలిపారు.

కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్



శాలిబండ: పాతబస్తీలోని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు విద్యార్థుల పాలిసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సైదులు తెలిపారు. కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ రెండు షిఫ్ట్‌లలో 120 సీట్లు, మెకానికల్‌లో 120 సీట్లు, ఈసీఈ 120 సీట్లు, కంప్యూటర్‌లో 60 సీట్లు, ఈఈఈలో 60 సీట్లు, ప్రింటింగ్‌లో 60 సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి రోజు కౌన్సెలింగ్‌లో 351 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసినట్లు కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ వంశీ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

శుభాకాంక్షలు



నాంపల్లి: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్) రీజినల్ మేనేజరుగా బాధ్యతలు స్వీకరించిన జె.శ్రీలతను యువజన కాంగ్రెస్ నేత, స్టాల్ యజమాని కొలిచెలిమి సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రౌడీషీటర్లలో మార్పు రావాలి: డీసీపీ ఉదయ్‌కుమార్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న డీసీపీ ఉదయ్‌కుమార్

జియాగూడ: రౌడీషీటర్లలో మార్పు రావాలని సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ మునావర్ ఆధ్వర్యంలో కులుసంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్లకు చెందిన 78 మంది రౌడీషీటర్లకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు తమ తమ ఏరియాల్లో జరుగుతున్న నేరాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ముఖ్యంగా గంజాయి విక్రయాలు, మద్యం అమ్మకాలు, వ్యభిచారం, జూదం, తదితర వాటిపై ముందస్తు సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలన్నారు. సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్లను వారి ప్రవర్తనను బట్టి రౌడీషీట్లు తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి, టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ రాములు, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



అబిడ్స్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని హైదరాబాద్ ఆర్చ్ డియోసెస్ వికార్ జనరల్ వై.బాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో పెట్టుబడి వేడుకలు నిర్వహించారు. బాల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ షాజహాన్ ఆంథోని, ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రదర్ జాకార్డ్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాల్‌రెడ్డి మాట్లాడుతూ..లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పీఎల్, పలువురు విద్యార్థులు బాలబాలికలు, ఎన్‌సీపీ క్లబ్ సెక్రటరీ, క్లాస్ లీడర్‌లు, హౌస్ లీడర్‌లు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ లీడర్‌లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బ్రీజ్ మోహన్, ఫిజికల్ డైరెక్టర్ అజిత్ కుమార్, ఉపాధ్యాయులు సంపత్ కుమార్, రమేష్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, శ్రీధర్, పుణ్యవతి, దీప్తి జైస్వాల్ పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: బెంగళూర్ నుంచి హైదరాబాద్ దిగుమతి అవుతున్న డ్రగ్స్‌ను ధూల్‌పేట్ ప్రాంతంలో మూడు కేసుల్లో 24.6 కిలోల గంజాయిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. హైదరాబాద్ పరిధిలో బెంగళూర్ నుంచి పల్లెపోలు భరత్ సాయి అనే వ్యక్తి ఒక ప్రైవేట్ ట్రావెల్‌లో డ్రగ్స్ తీసుకొస్తున్నాడన్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎస్సై రూప పంజగుట్ట మెట్రోస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భరత్ సాయి వద్ద 16 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తోపాటు ఒక గ్రామ్ ఓజీ గంజాయిని పట్టుకున్నారు. మరో కేసులో చంద్రశేఖర్, సీఐ ఎస్సై భూపాల్ కలిసి ధూల్‌పేట ప్రాంతంలో గంజాయిని అమ్ముతున్న ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 24.6 కిలోల గంజాయిని పట్టుకున్నారు. మొదటి కేసులో సుదేశ్ సింగ్ వద్ద 1.1 కేజీల గంజాయి, పి.దీపక్ వద్ద 22 కిలోల గంజాయి, మూడో వ్యక్తి లద్దుసింగ్ వద్ద 1.5 కేజీల గంజాయిని పట్టుకున్నారు. డ్రగ్స్, గంజాయిని అమ్మకాలు జరుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.

స్నేహితుడి హత్య కేసులో నలుగురి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ ఉదయ్ కుమార్‌రెడ్డి

విజయనగర్‌కాలనీ: స్నేహితుడిని చంపేస్తానని బెదిరించడంతో నలుగురు స్నేహితులు కలిసి బెదిరించిన వ్యక్తిని ఈనెల 19న రాత్రి 10.45 గంటల సమయంలో కత్తితో పొడిచి హత్య చేశారు. శనివారం మెహిదీపట్నం సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి నిందితుల వివరాలు వెల్లడించారు. మల్లేపల్లి ఆగాపురాలో నివసించే షేక్ అలీ అలియాస్ అలీం (34) ఫ్లవర్ డెకరేటర్. ఇతడిపై హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. కార్వాన్ మల్లైమెట్‌కు చెందిన పెయింటింగ్ వర్క్ చేసే ఒమర్‌బిన్ హుస్సేన్ అలియాస్ షాహేద్(29)తో తరచూ గొడవలు జరుగుతుండేవి. గతవారం రోజుల క్రితం నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో షాహేద్‌ను కొట్టడమే కాకుండా చంపేస్తానని బెదిరించాడు. దీనిని మనస్సులో పెట్టుకున్న షాహేద్ తన మిత్రులైన జిర్రాలో లేబర్ పనిచేసే మహ్మద్ ఖాజా (32), మురాద్‌నగర్ చోటీ మజీదు వద్ద నివసించే ఆటో డ్రైవర్ షేక్ ఫిరోజ్‌పాషా(30), నాంపల్లి ఆగాపురా వద్ద లేబర్ పనిచేసే సయ్యద్ గౌడ్(32)లను సంప్రదించి షేక్ అలీని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. హత్యకు పాల్పడిన నిందితులపై మాదాపూర్, మంగళ్‌హాట్, రాజేంద్రనగర్, అబిడ్స్, బంజారాహిల్స్, గోల్కొండ, లంగర్‌హౌస్, బేగంబజార్ తదితర పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు ఉన్నాయి. కాగా గత బుధవారం రాత్రి 10.45 గంటల సమయంలో షేక్ అలీని పిలిపించి మల్లేపల్లి నోబుల్ టాకీస్ చౌరస్తా ఫీల్‌ఖానా రోడ్‌లో మద్యం సేవించారు. ప్లాన్ ప్రకారం కత్తితో గొంతుపై, గుండెపై పొడిచి పారిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సమావేశంలో సౌత్‌వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ సయ్యద్ అశ్వక్, ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీ బి.కిషన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మనిషికి భరోసా కవిత్వం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మనిషికి భరోసా కవిత్వం అని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో రచయిత్రి గడ్డం సులోచన రచించిన మాటల చెట్టు పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థంతో చెట్టు పండ్లను ఇచ్చినట్లుగా ప్రతి మనిషి నిస్వార్థంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, కవి ఉదారి నారాయణ, జంట నగరాల అధ్యక్షుడు కె.శ్రీరాములు పాల్గొన్నారు.

మిధానిలో యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ యోగా ఉత్సవ్



సంతోష్‌నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మిధానిలో జూన్ 18వ తేదీ నుంచి శనివారం వరకు యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ యోగా ఉత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా వెబెక్స్ ద్వారా ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. యోగా శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానసికక ప్రశాంతతను పెంపొందిస్తుందన్నారు. మానవ, వనరుల జనరల్ మేనేజర్ రామకృష్ణారావు, డౌన్‌స్ట్రీమ్-మెయింటెన్స్ అదనపు జనరల్ మేనేజర్ అనూప్ కుమార్ మండల్, ఇన్‌చార్జి సెక్యూరిటీ డీజీఎం ఎంపీ రమేశ్, హెచ్ఆర్ ఏఆర్ రష్మి, హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ పి.సునీల్ కుమార్, పవన్ కుమార్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పత్రీజీ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞం


ధ్యాన జ్ఞాన మహా యజ్ఞంలో పాల్గొన్న కృష్ణారెడ్డి, సుదర్శ తదితరులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పీఎస్ఎస్ఎం ధ్యాన భాగ్యనగర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పత్రీజీ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞం జోరుగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సంగీత ధ్యాన జ్ఞానంతో ప్రారంభమైంది. బ్రహ్మర్షీ పితామహ పత్రీజీ వీడియో సందేశం ద్వారా అవగాహన కల్పించారు. క్యాంటం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులమర శెట్టి చంద్రశేఖర్ వ్యక్తిత్వ వికాసం మీద ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, టీఎస్ఎస్ఎం ధ్యాన భాగ్యనగర్ ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణారెడ్డి, సుదర్శ, లక్ష్మి, పూల, చంద్రశేఖర్ ధులిపూడి, రాజశేఖర్, ఆర్‌వి.రావ్ పాల్గొన్నారు.

హత్య కేసులో మరో ముగ్గురి రిమాండ్

గౌలిపురా: యువకుడి హత్య కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి వివరాల ప్రకారం.. బార్కాస్ సలాల ప్రాంతానికి చెందిన మహమ్మద్ సల్మాన్ షరీఫ్ (26)ను అతడి వదినతో పాటు ఆమె కజిన్ అయిన కర్ణాటక రాష్ట్రం బసవకల్యాణ్‌లో ఉంటున్న ఇలాహిల్లా మరో ముగ్గురితో కలిసి హత్య చేశారు. మృతుడు సల్మాన్‌షరీఫ్‌ను కర్ణాటక తీసుకెళ్లి పథకం ప్రకారం కారులో ఉరి బిగించి హత్యచేసి అక్కడే డ్యామ్‌లో పడేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతుడి వదినతో పాటు ఇలాహిల్లాను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. హత్యలో ప్రమేయం ఉన్న ఇలాహిల్లా స్నేహితులు జహంగీర్, గౌస్, అన్సార్ పరారీలో ఉండగా శనివారం వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లే భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి పేర్కొన్నారు.